# ఫిక్స్‌డ్ డిపాజిట్

మంథా వెంకట రమణారావు




తండ్రి కొడుకుని చావబాదుతున్నాడు.

తండ్రి వయసు నలభై. కొడుకు వయసు పది.

"వెధవా! లెక్కల్లో సున్న. ఇంగ్లీషులో ఆరు మార్కులు. తెలుగులో పది. జాగ్రఫీలో ఒకటి. చదువూ లేదు. సంధ్యా లేదు. పొద్దస్తమానం నీకు ఊరిమీద తిరిగేసరికే అయిపోతోంది. గొణే బిళ్ళ ఆడేసరికే సరి! క్లాసులో పాఠాలు శ్రద్ధగా విని, ఇంటి దగ్గర నాబందో అని చదివితేనే కద చదువు ఒంటపడుతుంది? పక్కింటి పిల్లలని చూడు. వాళ్ల సుబ్బిగాడు, రామిగాడు ఎలా చదివేసి మార్కులు తెచ్చుకుంటున్నారో?"

కొడుకు ఏడుస్తూనే జవాబు చెప్తున్నాడు. జవాబు చెప్తున్నందుకు మరిన్ని కాజాలు ఒంటి మీద పడుతున్నాయి.

"నాకు లెక్కలు తలకెక్కవు నాన్నా! ఇంగ్లీషు అసలే బోధపడదు. ఏం చెయ్యడం? నాకీ చదువొద్దు. నేను స్కూలుకెళ్లను."

"వెధవా? చదువొద్దూ? మరెందుకు పనికొస్తావురా? చదువుకోకపోతే ముష్టిచిప్ప పట్టుక అడుక్కుంటావా?"

"ఆ! ఎత్తుకుంటాను. హోమ్‌వర్క్ చెయ్యకపోతే మాస్టర్లు క్లాసులో బాదుతారు. మార్కులు తెచ్చుకోకపోతే ఇంట్లో నువ్వు బాదుతావు. అందరూ కలిపి నన్ను చంపండి. నేనింక బడికి వెళ్లను. ఇంకా కొట్టారంటే రైలుకింద తలపెట్టి చచ్చిపోతాను."

తండ్రి కొట్టడం ఆపేడు. కొడుక్కేసి ఆశ్చర్యంగా చూశాడు. అర్థంకాని కొరకరానికొయ్య అయిపోయాడే వీడు. వీడెందుకిలా బరితెగించిపోయాడు?

వీడిని కొట్టి లాభం లేదు. వీడికి మంచి మాటలు చెప్పాలి. మంచిగా లొంగదీసుకోవాలి.

వీడు చదవకపోతే, పాడైపోతే మరి వీడి మీద పెట్టుకున్న తమ ఆశలన్నీ ఏంకాను? తన భావి, తన భార్య భావి, తాను కన్న, కంటున్న తక్కిన పిల్లల భవిష్యత్తు ఏమౌతుంది?

వీడు పిలక్కి తాడుకట్టుకొనన్నా చదవాలి. మంచి మార్కులు తెచ్చుకోవాలి. యూనివర్సిటీ పరీక్షలు మొదటిక్లాసులో పాసవాలి. డాక్టరో, ఇంజనీరో, ఐఏఎస్సో అవాలి! రెండు చేతులా సంపాదించాలి. లక్షల కట్నంతో కోడలు రావాలి. "మామగారూ!" అంటూ కోడలు కాఫీ అందించాలి. "నాన్నా! అమ్మా! ఇదిగో నీ చేతి ఖర్చుకి రెండువేలు!" అని కొడుకు నెలనెలా డబ్బు చేతిలో పెట్టాలి. అప్పుడే తృప్తి, ఆనందం. మరి కొడుకులని కని లాభం ఏమిటి? వీడిలా మొండికెస్తె ఎలా?

"ఒరే నాయనా! మన ఎదురింటి ప్లీడరుగార్ని చూడు. పక్కింటి డాక్టరుగార్ని చూడు. వేలకి వేలు ఆర్జిస్తున్నారు. కార్లు కొన్నారు. ఇళ్లు లేపారు. ఇష్టమొచ్చినట్టు ఖర్చు పెట్టుకుంటున్నారు. మంచి మంచి బట్టలు కొనుక్కుంటున్నారు. నువ్వూ వాళ్లలా అవాలి. వేలకి వేలూ ఆర్జించాలి. బాగా చదువుకుంటే వాళ్లలా అవుతావు. అందువల్ల ..."

తండ్రి మాటలసుత్తి కొడుతున్నాడు, కొడుకుని కొట్టక.

తండ్రి కళ్లలోని దురాశ క్రూరగా కనిపించింది కొడుక్కి. 'నేన్నిన్ను కన్నాను, నీకు తిండి పెట్టి పెంచాను, విద్యాబుద్ధులు చెప్పించాను. కాబట్టి నువ్వు ఆదర్శపుత్రుడిగా నీ కర్తవ్యాన్ని నిర్వహించు' అంటున్నాయా చూపులు.

"నాన్నా! నేను చదవకపోతే నష్టం నాకే కదా? నేనే కదా చెడతాను? మీకెందుకు బాధ మధ్యని? నాకు తెలివితేటలు లేవు. డాక్టరూ, ప్లీడరూ కాలేను. నా మీద ఏ ఆశలూ పెట్టుకోకండి. నా మానాన్న నన్ను వదిలిపెట్టండి!" అన్నాడు కొడుకు.

తండ్రి తల కొట్టుకున్నాడు. "మా కడుపు చెడ పుట్టేవురా!" అన్నాడు. తను పెట్టిన మదుపంతా నీళ్లపాలయింది. తన ఫిక్సెడ్‌డిపాజిట్ వీడు, అనుకున్న కొడుకు ఉత్త పనికిరాని కాగితం ముక్కగానే మిగిలేడు!

మర్నాడు తన గోడు ఒక మిత్రుడితో చెప్పకున్నాడీ తండ్రి.

"ఓస్! ఇంతేనా? మీవాడు చాలా పెద్దవాడవుతాడు. బుద్ధిగా చదివేసుకొని మొదటి తరగతిలో వేసేయి. నిరుద్యోగులలో ఒకడిగా వుండే గతి మీవాడికి తప్పింది. చదువుమీద మీవాడు శ్రద్ధ చూపించకపోవడం చాలా మంచి లక్షణం అనుకో. మన ముఖ్యమంత్రేం చదువుకున్నాడు? మన పెద్ద పెద్ద వ్యాపార రత్నాలేం చదువుకున్నారు? కోట్లకి పడగలెత్తేరా? మీవాడూ కాబోయే నాయకుడో, కనీసం రాజకీయ గూండానో అవుతాడు."

తండ్రి మనసులో మళ్లా ఆశ చిగురించింది. తన ఫిక్సెడ్ డిపాజిట్ మంచి వడ్డీయే సంపాదించిపెడుతుందన్నమాట! అయితే ఫరవాలేదు. మనస్సు సమాధానపరచుకున్నాడు తండ్రి.